సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం ; 29 ; డిసెంబర్ ; 2024



సైన్స్ సంబరానికి వేళాయె..!

జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సైన్స్ ప్రాజెక్టుల ఎగ్జిబిషన్‌కు రంగం సిద్ధమైంది. మూడు కేటగిరిల్లో ప్రాజెక్టులను ప్రదర్శించనున్నారు. - 8లో



సమస్యలకు సాంకేతిక పరిష్కారం

టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఆవిష్కార్ హేకతాన్ కార్యక్రమం ప్రారంభమైంది. 19 రాష్ట్రాల నుంచి 50 వరకు విద్యార్థి బృందాలు పాల్గొంటున్నాయి. - 8లో

రైలు నుంచి జారిపడి మహిళకు గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని సింగుమహంతి పేటకు చెందిన కె.తులసి శనివారం మధ్యాహ్నం పలాస నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి పడింది. తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు స్పందించి టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

న్యూస్‌రీల్

తాగొద్దు.. తిరగొద్దు



ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : డిసెంబరు 31 (బుధవారం) అర్ధ రాత్రి ఒంటి గంట తర్వాత రోడ్లపై ఎవరూ తిరగరాదని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని, రహదారులపై నూతన సంవత్సర వేడుకలు నిర్వహించరాదని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు కొన్ని సూచనలు చేస్తూ శనివారం ప్రకటన విడుదల చేశారు. ర్యాష్ డ్రైవింగ్ చేసినా, లౌడ్‌స్పీకర్లు పెట్టినా, డ్యాన్స్‌ల పేరిట న్యూసెన్స్ చేసినా, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం దుకాణాలు, బార్‌లు నిర్ణీత సమయం వరకే తెరిచి ఉండాలని స్పష్టం చేశారు. హోటళ్లు, రెస్టారెంట్లలో జరిగే ప్రత్యేక కార్యక్రమాలకు న్యూఇయర్ సందర్భంగా ఎటువంటి అనుమతులు లేవన్నారు. అశ్లీల నృత్యాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకొని పోలీసులకు సహకరించాలని కోరారు.

3న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

అరసవల్లి : జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జనవరి 3న స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సీఈఓ ఎల్.ఎస్.వి.శ్రీధర్‌రాజా ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి 6వ స్థాయి, 11.30 గంటలకు 3వ స్థాయి, మధ్యాహ్నం 12.30 గంటలకు 5వ స్థాయి, 2.30 గంటలకు 2వ, 4వ, 1వ, 7వ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, వైస్ చైర్‌పర్సన్లు పాలిన శ్రావణి, సిరిపురపు జగన్మోహనరావు, వీరఘట్టం జెడ్పీటీసీ జంపు కన్నతల్లిల అధ్యక్షతన సమావేశాలు జరుగనున్నాయని పేర్కొన్నారు. అధికారులు తాజా సమాచారంతో హాజరుకావాలని సూచించారు.

ఉత్తమ సేవలకు పురస్కారం



రమణమ్మను సత్కరిస్తున్న దృశ్యం


ఆమదాలవలస: ఇటీవల జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రధానోపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్న ఆమదాలవలస మున్సిపాలిటీ గేటు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం టి.వి.రమణమ్మకు మరో ప్రతిష్టాత్మక పురస్కారం లభించింది. విశాఖకు చెందిన మదర్‌థెరిసా ఫౌండేషన్ సంస్థ గురుబ్రహ్మ అవార్డును ప్రకటించింది. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రమణమ్మకు మంగళగిరి డిప్యూటీ కలెక్టర్ సవరమ్మ ఆధ్వర్యంలో సన్మానం చేసి అవార్డు, ధ్రువపత్రం అందజేశారు. ఉత్తమ బోధన, సమాజ సేవను గుర్తించి ఈ అవార్డు అందజేసినట్లు డిప్యూటీ కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఆమదాలవలస ఎంఈఓ జి.రాజేంద్రప్రసాద్, విశ్రాంతి ఉపాధ్యాయులు కర్రి రవిప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై దాడి

టెక్కలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నందిగాం మండలం చిన్నలవునిపల్లి గ్రామంలో వరుసగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులపై దాడులు చేయడం, తప్పుడు కేసులు నమోదు చేయించడం వంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. తాజాగా రెండు రోజుల క్రితం గ్రామంలో చిన్ని చిన్నమ్మ అనే మహిళపై టీడీపీ సానుభూతిపరులు దాడికి పాల్పడగా కాలు విరగడంతో టెక్కలి జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, నందిగాం ఎంపీపీ ఎస్.శ్రీరామ్మూర్తి, నాయకులు చిన్ని జోగారావు, ఎ.రాహుల్ తదితరులు శనివారం టెక్కలి ఆసుపత్రిలో బాధితురాలిని పరామర్శించారు. దాడికి గల కారణాలు తెలుసుకున్నారు. గ్రామంలో కావాలనే గొడవలు సృష్టించి దాడులు చేస్తున్నారని బాధితురాలు చిన్నమ్మ వాపోయింది. కాలు విరిగిపోయి ఆసుపత్రిలో చేరినా వైద్య సిబ్బంది సరిగ్గా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. అనంతరం తిలక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టెక్కలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులపై కక్ష సాధింపు చర్యలు చేస్తున్నారని మండిపడ్డారు. పోలీసులు సైతం అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి బాధితులకు అన్యాయం చేస్తున్నారని చెప్పారు. చిన్నమ్మకు పార్టీ తరఫున అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేయాలని తిలక్ డిమాండ్ చేశారు.



చిన్నమ్మను పరామర్శిస్తున్న పేరాడ తిలక్, శ్రీరామ్మూర్తి



మంచుకాలం మీరెంత భద్రం?

భూతలం..శీతలంగా మారింది. నిన్నటివరకు సాధారణంగానే ఉన్న వాతావరణం ఒక్కసారిగా చల్లబడిపోయింది. దగ్గు, జలుబు, శ్వాసకోశ సమస్యలతో బాధ పడేవారికి ఈ పరిస్థితి సవాల్ విసురుతోంది. మరీ ముఖ్యంగా గర్భిణులు, చిన్నారులు, వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాల్సిందేనని వైద్యులు సూచిస్తున్నారు. ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా అనారోగ్యం పాలవ్వక తప్పదని హెచ్చరిస్తున్నారు. కమ్ముకుంటున్న పొగమంచుల్లో ప్రయాణాలు కూడా ఏమంత మంచిది కాదని చెబుతున్నారు. - టెక్కలి

- పెరిగిన చలి గాలుల తీవ్రత
- గర్భిణులు, చిన్నారులు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు
- పొగమంచులో వాహన ప్రయాణాలూ ప్రమాదకరమే

గర్భిణులూ జాగ్రత్త..



- శీతాకాలంలో గర్భిణులు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- వ్యాధి నిరోధకత పెంచుకోవాలి.
- ఆహారంలో పాలు, పండ్లు వంటి మంచి పోషకాహారం, చిరుధాన్యాలు, సమతుల ఆహారం తీసుకోవాలి.
- తగినంత విటమిన్ డి శరీరానికి అందేలా చూసుకోవాలి.
- రోగనిరోధక శక్తిని పెంపొందించే నారింజ, ఆపిల్, అరటి వంటి విటమిన్ సి ఉన్న పండ్లను తీసుకోవాలి.
- పాలకూర, కాలీఫ్లవర్, ఆకుకూరలు తినాలి. అలాగే మంచినీరు తాగుతూ ఉండాలి.
- శీతాకాలానికి అనుగుణంగా దుస్తులు ధరించాలి. ముఖ్యంగా పాదాలు, వేళ్లకు రక్షణ కల్పించాలి. శరీరంలో ఉష్ణోగ్రతను బ్యాలెన్స్ చేసుకోవాలి.

పిల్లలపై ఓ కన్నేయండి..

శీతాకాలంలో పిల్లలు ఇట్టే అనారోగ్యం బారిన పడతారు.

- ముఖ్యంగా చలి గాలుల వల్ల శ్వాసకోశాలు, సైనస్, చర్మం ప్రభావితమవుతాయి.
- చలికాలంలో భోజనం వేడివేడిగా, తాజాగా ఉండేలా చూడాలి. ఫ్రిజ్‌లో పెట్టినవి వేడి చేసి ఇవ్వడం వంటివి చేయకూడదు.
- క్యారెట్, బీట్‌రూట్, బంగాళదుంప, చిలగడ దుంప మొదలైన దుంపలు ఎక్కువగా పెడితే మంచిది.
- వీటిలో ఉండే రకరకాల విటమిన్లు, ఒమెగా 3, ఫోలిక్ యాసిడ్, కాల్షియం మొదలైనవి చర్మాన్ని పగలకుండా కాపాడుతాయి.
- వీటితో పాటు విటమిన్ 'సి'గల పండ్లు పిల్లలు ఎక్కువగా తినేలా చూడాలి.



- ఫ్రిజ్ నీళ్లు, ఐస్‌క్రీంలు, పంచదార కలిసినవి ఏవైనా సరే చలికాలంలో పిల్లలకు మంచిది కాదు.
- గోరు వెచ్చని నీళ్ల స్నానం చేయడం, గోరు వెచ్చని నీళ్లు తాగడం ఎంతో శ్రేయస్కరం. కాసేపు ఎండలో ఆడుకోవడం మేలు చేస్తుంది.
- చలికాలంలో ఎలర్జీలు వంటివి రాకుండా ఉండే నాణ్యత గల దుస్తులనే కొనాలి.
- సుస్తీ చేస్తే ఇంటి చిట్కాలకు పరిమితం కాకుండా వైద్యులను సంప్రదించాలి.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



శీతాకాలంలో చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి. వీరిలో దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి వరకు భోజనం, దుస్తులు తదితర వాటి విషయంలో జాగ్రత్తలు పాటించాలి. చలి గాలి తగలకుండా ప్రత్యేకంగా రక్షణ ఇచ్చే దుస్తులు వేసుకోవాలి. మంచులో తిరగకుండా ఉండాలి.
- బీఆర్‌కె మహారాజ్, చిన్న పిల్లల వైద్యుడు, జిల్లా ఆస్పత్రి, టెక్కలి

అప్రమత్తంగా ఉండాలి



శీతాకాలంలో గర్భిణులు తమ ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలి. ఈ కాలంలో బీపీ పెరిగే అవకాశం ఉంది. ఆరోగ్యం లో ఎలాంటి మార్పులు కనిపించినా తక్షణమే వైద్యులను సంప్రదించాలి. నీళ్లు అధికంగా తీసుకోవాలి. వేడి పదార్థాలు తినాలి. రెండు ప్రాణాలు ఆధారపడి ఉంటాయి. ఈ కాలంలో గర్భిణులు ఆరోగ్యం, శరీరం రక్షణ విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ముందస్తు చర్యగా ఫ్లూ వ్యాక్సిన్ వేసుకోవాలి, విటమిన్ డి పుష్కలంగా ఉండే విధంగా చూసుకోవాలి.
- డాక్టర్ ఎం.ధనలక్ష్మి, ప్రసూతి వైద్యురాలు, జిల్లా ఆసుపత్రి, టెక్కలి



వృద్ధుల సంరక్షణ అత్యవసరం



- చలిగాలుల్లో అత్యధికంగా ఇబ్బంది పడేవారు వృద్ధులు.
- చాలా సందర్భాల్లో ఈ వాతావరణం వారికి ప్రాణాంతకరంగా మారుతుంది.
- శ్వాసకోశ సమస్యలున్న వారు చలిలో తిరగకూడదు. ఆస్తమా బాధితులు తప్పనిసరిగా ఇన్‌హెలర్ వినియోగించాలి.
- జలుబు, దగ్గు, జ్వరం ఉంటే ఇంట్లో రెండు, మూడు రోజులు విశ్రాంతి తీసుకోవాలి. మంచినీళ్లు ఎక్కువగా తాగాలి. దగ్గు, జలుబు వంటి సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ఇన్‌ఫెక్షన్ వచ్చే ప్రమాదముంది.
- ఆస్తమా, నుమోనియాతో బాధపడే వారు మందులను వాడకపోతే సమస్య తీవ్రంగా మారే అవకాశముంది.
- గోరువెచ్చటి నీటితో స్నానం చేయాలి. కాళ్లకు చెప్పులు లేకుండా నడవకూడదు. చేతులు, కాలి పాదాలు పగిలితే రోజూ గోరువెచ్చని నీటిలో కొద్దిగా ఉప్పువేసి అందులో కొద్దిసేపు ఉంచాలి. తర్వాత పాదాలను శుభ్రంగా పొడి బట్టతో తుడిచి సరైన క్రీముతో మర్దన చేస్తే పగుళ్లు తగ్గుముఖం పడతాయి.
- త్వరగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలు తీసుకోవాలి. నీళ్లు ఎక్కువగా తాగాలి.
- ఫ్రిజ్‌లో పెట్టిన ఆహార పదార్థాలు, నీళ్లు తీసుకోకూడదు. తెల్లవారుజాము వాకింగ్, జాగింగ్‌తో కాస్త ముప్పే. శరీరానికి ఎండ తగిలే సమయంలోనే జాగింగ్ చేయడం మంచిది. ఉదయం 8 నుంచి 9, సాయంత్రం 4 నుంచి 5 మధ్య వాకింగ్ చేసుకోవాలి. సూర్యరశ్మి తగిలే ప్రాంతంలో జాగింగ్ చేయడం మంచిది.

రాత్రి ప్రయాణం వద్దు..



వీలైనంత వరకు రాత్రి ప్రయాణాలు చేయకపోతేనే మేలు.

- తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తే కచ్చితంగా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ముఖ్యంగా కుటుంబ సభ్యులతో కార్లలో ప్రయాణాలు, ద్విచక్రవాహనాలతో వేకువజామున, రాత్రి వేళల్లో రాకపోకలు సాగించేవారు మరింత జాగ్రత్తలు పాటించి వాహనాలు నడపాలి.

మంచులో ప్రయాణిస్తున్నారా..?

- జిల్లాలో పొగమంచు విపరీతంగా కురుస్తోంది. ఈ నేపథ్యంలో రాత్రి, వేకువన ప్రయాణాలు చేసే వారు అత్యంత జాగ్రత్తగా ఉండాలి.
- అకస్మాత్తుగా మంచు కురుస్తున్న ప్రాంతంలోకి వాహనాలు ప్రవేశించినప్పుడు అదుపు తప్పే ఆస్కారాలుంటాయి.
- రోడ్డుపై ఉన్న మార్జిన్లలో ఆగి ఉన్న వాహనాలను వెనుక నుంచి ఢీకొనడంతోనే అత్యధిక సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయి.
- ఈ శీతాకాలం ప్రయాణం తప్పనిసరైతే ద్విచక్ర వాహనాలు, కార్ల లైటింగ్ (పార్కింగ్ లైట్లు) ఉండేలా చూసుకోవాలి.
- ఏదైనా వాహనం 50 మీటర్ల దూరంలో ఉండగానే బ్రేక్‌ను ఉపయోగించాలి.
- రోడ్డుపై, మార్జిన్లలో వాహనాలు ఆగిపోతే వెంటనే కచ్చిత సంకేతాన్నిచ్చేలా రేడియం స్టిక్కర్, సూచికలు ఉపయోగించాలి.
- వాహనం క్యాబిన్ అద్దాన్ని లోపల, వెలుపల పొడి బట్టతో తుడవాలి.

ఈ సదుపాయాలు ఉంటే మేలు..

- రాత్రి పూట ప్రయాణాలు చేసే లారీ డ్రైవర్లకు అర్ధరాత్రి దాటిన తర్వాత ఎక్కడో ఓ చోట వాహనాన్ని ఆపేలా ఏర్పాట్లు ఉండాలి.
- 2, 3 గంటలకు ఒకసారి డ్రైవర్‌కు టీ తాగేందుకు అవకాశం ఇవ్వాలి.
- అర్ధరాత్రి వెళ్లే వాహనాలను ఏదో ఒకచోట ఆపి పెట్రోలింగ్ పోలీసులు తరచూ తనిఖీలు నిర్వహించాలి. డ్రైవర్లను ఆపి ముఖాన్ని కడిగించి టీ తాగించి పంపాలి.

రాత్రి ప్రయాణాలు మానుకోవాలి..



ప్రస్తుతం చలి తీవ్రత, పొగ మంచు ఉన్న నేపథ్యంలో కుటుంబ సభ్యులతో అర్ధరాత్రి ప్రయాణాలు మంచిది కాదు. సాధ్యమైనంత వరకు రాత్రి 10 గంటల దాటిన తర్వాత ఉదయం 7 గంటల లోపు ప్రయాణాలు వాయిదా వేసుకుంటే మంచిది. అలాగే ద్విచక్రవాహనదారులు తగిన జాగ్రత్తలు పాటించి రాకపోకలు సాగించాలి. అలాగే జాతీయ రహదారిపై వేకువజాము, అర్ధరాత్రి వేళల్లో వాహనాలు నిలపకూడదు. ఈ సీజన్‌లో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పోలీస్ సిబ్బంది ప్రత్యేక గస్తీ కాస్తున్నారు.
- డీఎస్‌ఆర్‌వీఎస్‌ఎన్.మూర్తి, డీఎస్పీ, టెక్కలి.



గ్రీటింగ్.. చీటింగ్!

- కొత్త సంవత్సర శుభాకాంక్షల లింక్‌లతో జాగ్రత్త
- ఒక్క క్లిక్‌తో ఊడ్చేస్తారు
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్ : నూతన సంవత్సర వేళ సైబర్ మోసగాళ్లు సరికొత్త మోసాలకు సిద్ధమవుతున్నారు. కొత్త సంవత్సర శుభాకాంక్షలు పేరిట మొబైల్ ఫోన్లకు ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్‌ల ద్వారా సందేశాల లింక్‌లు పంపిస్తున్నారు. గుర్తు తెలియని నంబర్ల ద్వారా వచ్చే ఈ లింక్‌లను ఏమాత్రం క్లిక్ చేసినా మీ అకౌంట్లలో నగదును క్షణాల్లో మాయం చేస్తారు. ఈ నేపథ్యంలో ఈ మూడు రోజులూ అప్రమత్తంగా ఉండాలని పోలీసులు జిల్లా ప్రజలకు సూచనలిస్తున్నారు.

సైబర్ అలెర్ట్

ఏం చేస్తారంటే..?

మరో మూడు రోజుల్లో కొత్త సంవత్సరంలో (2025)లో అడుగుపెడుతున్నాం. డిసెంబరు 31 అర్ధరాత్రి నుంచే విషెష్ హంగామా మొదలవుతుంది. బంధువులకు, శ్రేయోభిలాషులకు ఒక్కొక్కరూ ఒక్కో విధంగా శుభాకాంక్షలు చెప్పేందుకు ప్రణాళిక వేసుకుంటారు. కొందరు వినూత్నంగా ఆలోచిస్తూమొబైల్‌లో వచ్చే రకరకాల చిత్రాలు, సందేశాలను పేర్లతో సహా తయారు చేసుకుని పంపుతారు. అయితే సైబర్ కేటుగాళ్లు ఇక్కడే రంగంలోకి దిగుతారు. మీకు నచ్చేవిధంగా మీ పేరుతో గ్రీటింగ్స్, సందేశాలను పంపుకోవచ్చని.. మీరు చేయాల్సిందల్లా ఈ క్రింది లింకుపై క్లిక్ చేసి వివరాలు నమోదు చేస్తే చాలని అంటారు. మన మొబైల్‌లోని టెలిగ్రామ్, వాట్సాప్‌లకు ఏపీకే (ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్) ఫైల్స్ రూపంలో మెసేజ్‌లు పంపుతారు. పొరపాటున ఆ లింక్‌ను క్లిక్ చేస్తే అంతే సంగతులు. మన ఫోన్‌లో సమాచారమంతా వారికి పోతుంది. కాంటాక్ట్ నంబర్లు, ఫొటోలు, వీడియోలు, ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలే కాక డాక్యుమెంట్ ఫైళ్లు సైతం వారికి చేరిపోతాయి.


పరిశీలన అవసరం..

రకరకాల గిఫ్ట్‌ఓచర్లు, గ్రీటింగ్స్, ట్రావెల్, గ్యాడ్జెట్స్, ఫ్యాషన్లపై ఇచ్చే డిస్కౌంట్లును ఒకటికి రెండుసార్లు నమ్మదగినివా కావా అన్నది పరిశీలన చేసుకోవాలి. వాటి రివ్యూస్ చూస్తూ వెరిఫైడ్, అథెంటిక్ వెబ్‌సైట్ల లోకి వెళ్లి ఆఫర్లను తెలుసుకునేందుకు ప్రయత్నించాలి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

- అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఏపీకే ఫైళ్లను ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయకూడదు.
- ఫోన్లోని సెట్టింగ్‌లో ఇన్‌స్టాల్ ఫ్రం అన్‌నోన్ సోర్సెస్ అనే ఆప్షన్‌ను డిజేబుల్ చేసుకోవాలి. ఇలా చేస్తే మనకు తెలియకుండా యాప్స్ ఇన్‌స్టాల్ కావు.
- మొబైల్ సెట్టింగ్‌లో ఫోన్ నెంబర్లను యాక్సెస్ చేసే అనుమతి ఇవ్వరాదు.
- తెలియని ఏపీకే ఫైల్, మాల్‌వేర్ ఇన్‌స్టాల్ అయితే ఫోన్‌లో రీసెట్ ఆప్షన్ కొట్టాలి.
- ఈ-మెయిల్స్, టెక్ట్స్ ఇతర సోషల్‌మీడియా యాప్‌ల ద్వారా నకిలీ లింక్స్‌ను గుర్తించాలి. క్లిక్ చేయరాదు.
- గివ్‌అవేస్ పోటీల ద్వారా వినియోగదారులను ట్రాప్‌చేసి వ్యక్తిగత సమాచారాన్ని దోచేస్తారు. మన వివరాలను సేకరించి డార్క్‌వెబ్‌కు అమ్మేస్తారు.
- మన మొబైల్/ల్యాప్‌టాప్ (కంప్యూటర్)లలో ఉండే ఆపరేటింగ్ సిస్టమ్, యాంటీవైరస్ ప్రోగ్రామ్, అధికారిక యాప్‌లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి. సైబర్ నేరగాళ్లకు చిక్కకుండా సంబంధిత సంస్థలు ఎప్పటికప్పుడు తమ వ్యవస్థల్లో మార్పులు చేస్తుంటాయి.

క్లిక్ చేయకండి..



అపరిచిత వ్యక్తులు పంపే ఏపీకే ఫైల్స్ మెసేజ్‌లపై ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయవద్దు. వ్యక్తిగత సమాచారాన్ని సైబర్ నేరగాళ్లు దుర్వినియోగం చేస్తారు. విషెస్ చెప్పాలనుకునేవారు ఫోన్ ద్వారా మాట కలపడం, లేదంటే సందేశాన్ని పంపడం, వీలైతే వ్యక్తిగతంగా కలుసుకోవడం మంచిది. నూతన సంవత్సరాన్ని అంతా ఆనందంగా గడుపుకోవాలి.. సైబర్‌వలలో మాత్రం పడకండి. అప్రమత్తంగా ఉండండి.
- సీహెచ్ వివేకానంద, డీఎస్పీ, శ్రీకాకుళం

గత ఆరేళ్లలో జిల్లాలోని సైబర్ కేసులు..	సంవత్సరం	2018	2019	2020	2021	2022	2023	2024
	కేసులు	39	47	64	64	99	37	ప్రకటించాల్సి ఉంది



ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

కానిస్టేబుల్ అభ్యర్థులకు.. రేపటి నుంచే దేహదారుఢ్య పరీక్షలు

- సిద్ధమైన ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానం
- ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్ : పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల దేహ దారుఢ్య పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి తెలిపారు. ఈ నెల 30 నుంచి జనవరి 18 (సెలవు దినాల్లో మినహా) వరకు ఈ పరీక్షలు జరుగుతా యన్నారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వు మైదానంలో ఎంపికల విధులకు హాజరయ్యే పోలీస్ అధికారులు, సిబ్బందికి శనివారం ఎస్పీ పలు సూచనలు అందించారు. అనంతరం మైదానంలో ఏర్పాట్లు పరిశీలించారు. పారదర్శకంగా దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. అభ్యర్థులకు కేటాయించిన తేదీ, నిర్దేశిత సమయానికి హాజరుకావాలన్నారు. ఏపీ స్టేట్ లెవల్ రిక్రూట్‌మెంట్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. జిల్లాలో 7390 మంది ప్రిలిమినరీ పరీక్ష ఉత్తీర్ణత సాధించగా, వీరిలో పురుషులు 6215 మంది, మహిళలు 1775 మంది ఉన్నారని వివరించారు. అభ్యర్థులకు ఛాతీ కొలత, బరువు, ఫిజికల్ ఎఫిషియన్సీ 1600, 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్ ఈవెంట్లు నిర్వహించనున్నట్లు చెప్పారు. మైదానంలోకి అనుమతి, క్యూ నిర్వహణ, క్రమపద్ధతిలో ఈవెంట్లకు పంపించడం, అర్హత సాధించిన వారికి ధ్రువీకరణ పత్రం అందజేయటం వంటివి పక్కాగా జరగాలని స్పష్టం చేశారు. ముగింపు తేదీ వరకు నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సెన్సార్లు, సీసీ కెమెరాలు ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. వైద్యులు, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ కె.వి.రమణ, డీఎస్పీలు అప్పారావు, మూర్తి, ప్రసాదరావు, శేషాద్రి, రాంబాబు, శివరామిరెడ్డి, ఏవో గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు సూచనలివే..

- నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలి.
- అటెస్టెడ్ జిరాక్సు కాపీలు ఒక సెట్ తీసుకురావాలి.
- కాల్ లెటర్లలో పేర్కొన్న తేదీ, సమయానికే చేరుకోవాలి.
- ఉదయం 5గంటలు లోపు హాజరుకావాలి.
- ఉత్తీర్ణత సాధించిన వారు ఫలితాల కాపీ తీసుకోవాలి.
- సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ యంత్రాలు అనుమతించరు.
- లోపలకి వెళ్లిన అభ్యర్థులను పరీక్షలు పూర్తయ్యాకే బయటకు పంపిస్తారు.
- కాల్‌లెటర్‌లో తెలిపిన స్కోర్‌కార్డు స్టేజ్-1, స్టేజ్-2 ఒరిజినల్ రిజల్టుతో హాజరుకావాలి.
- అధికారులు అడిగిన వివరాలు తెలియజేయాలి.
- ఉద్యోగాలు ఇప్పిస్తామని లంచాలు అడిగితే 6309990800, 6309990911 నంబర్లకు సమాచారం ఇవ్వాలి.

క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం


దాతలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారి

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి శ్రీకాకుళంకు చెందిన భక్తులు శనివారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. పొందూరుకు చెందిన యతీరాజుల రాధాకృష్ణ అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ. 1,00,116 విరాళాన్ని అందించారు. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు.

ఇంటి నుంచి మద్యం షాపునకు విద్యుత్

నరసన్నపేట: మండలంలోని ఉర్లాంలో ఒక మద్యం దుకాణానికి నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నుంచి విద్యుత్ వినియోగిస్తుండడంతో విద్యుత్ విజిలెన్స్ అధికారులు శనివారం తనిఖీలు చేశారు. నిబంధనల మేరకు మద్యం షాపుకు కేటగిరీ–2 మీటర్ ఉండాలి. అయితే మద్యం షాపు నిర్వహిస్తున్న వ్యక్తి ఇంటి నుంచి విద్యుత్ సరఫరా చేసుకొని వినియోగిస్తున్నారు. దీంతో విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు వెళ్లడంతో డీఈ మల్లికార్జునరావు, ఏఈ వాసుదేవరావులు వెళ్లి పరిశీలించారు. ఇంటి నుంచి విద్యుత్ సరఫరా తీసుకున్నట్లు గుర్తించారు. ఉన్నతాధికారుల సూచన మేరకు చర్యలు తీసుకుంటామని ఏఈ వాసుదేవరావు తెలిపారు. మరో దగ్గర ఉన్న కేటగిరీ–2 మీటర్ సిఫ్టింగ్‌కు పెట్టారని, అది ఆలస్యం కావడంతో ఇంటి నుంచి విద్యుత్ సరఫరా వినియోగిస్తున్నట్లు సదరు వ్యక్తి తెలిపారన్నారు. ఇలా వాడడం నేరమనే విషయాన్ని తెలియజేశామన్నారు. ప్రస్తుతం కనెక్షన్ తొలగించడం జరిగిందన్నారు.

నాటుసారాతో ఇద్దరు అరెస్టు


మహిళను అదుపులోకి తీసుకున్న దృశ్యం

సోంపేట: స్థానిక ఎక్సైజ్ సిబ్బంది మండలంలో శనివారం దాడులు నిర్వహించి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేయడం జరిగిందని సీఐ కె.బేబి తెలిపారు. ఎం.జీ.పురం గ్రామంలో దాడులు నిర్వహించి 10 లీటర్ల నాటుసారా ప్యాకెట్లతో ఒక వ్యక్తిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. అతని వద్ద నుంచి ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కొరంజిభద్ర గ్రామంలో 10 లీటర్ల నాటుసారాతో మరో మహిళను అదుపులోకి తీసుకున్నారు. మందస మండలం రామరాయి గ్రామంలో 600 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. దాడుల్లో సోంపేట, పలాస, శ్రీకాకుళం సిబ్బంది పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారికి ఆనుకొని పట్టపగలు మహిళ మెడలో చైన్‌ను బైక్ మీద వచ్చిన ఇద్దరు యువకులు దొంగలించిన ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కేశవరావుపేట పంచాయతీ కింత లిమిల్లు గ్రామానికి చెందిన బొడ్డేపల్లి అమ్మాయమ్మ లక్ష్మోడిపేట రోడ్డులో శనివారం మధ్యాహ్నం 12.30 గంటలు సమయంలో గొర్రెలు మేపుతోంది. నిర్మాణంలో ఉన్న ఒక ఇంటి పునాదులపై రోడ్డు పక్కన మహిళ కూర్చుంది. ఈ సమయంలో ఇద్దరు బైక్‌పై వచ్చి చైన్ తెంచుకొని పారిపోయారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు



జలుమూరు: గ్రామాల్లో ఎక్కడైనా బెల్టు షాపులు కనిపిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు చేస్తున్న ప్రకటనలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిస్థితులకు పొంతన లేకుండా పోతోంది. విచ్చలవిడిగా గ్రామాల్లో బెల్టు దుకాణాలు వెలుస్తుండడంతో మద్యం ఏరులై పారుతోంది. మండల కేంద్రమైన జలుమూరుకు ఆనుకుని ఉన్న గ్రామాలకు వైన్‌షాపు యాజమాన్యాలు మద్యాన్ని డోర్ డెలివరీ చేస్తూ బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నాయి. కాగా ఇంత జరుగుతున్నా మద్యం అమ్మకాలపై సంబంధిత ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. ఈ విషయాన్ని కోటబొమ్మాళి ఎక్సైజ్ సీఐ వద్ద ప్రస్తావించగా తమ పరిధిలో ఎక్కడా అటువంటి అమ్మకాలు లేవని బదులిచ్చారు. మరోవైపు 94916 16199 నంబర్‌తో ఒక వ్యక్తి ఫోన్‌చేస్తూ తాను ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా పరిచయం చేసుకుంటున్నారు. తనకు చెబితే కేసులు లేకుండా చూస్తామని హామీ ఇస్తున్నారు.

సైన్స్ సంబరానికి వేళాయె..!




ప్రాజెక్టు పనితీరును చూపిస్తున్న విద్యార్థినులు(ఫైల్)

- రేపు మండల స్థాయి సైన్స్ పోటీల నిర్వహణ
- మూడు కేటగిరిల్లో ప్రాజెక్టుల ప్రదర్శన
- విజేతలకు జిల్లా పోటీలకు నేరుగా అర్హత

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను గుర్తించేందుకు పాఠశాల విద్యాశాఖ నడుం బిగించింది. 2024–25 విద్యా సంవత్సరానికిగాను పాఠశాల విద్యాశాఖ, ఏపీఎస్‌సీఈఆర్టీ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో సైన్స్ ప్రాజెక్టుల ఎగ్జిబిషన్‌కు రంగం సిద్ధమైంది. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ ప్రాజెక్టుల ప్రదర్శనలో పాల్గొనవచ్చు. ఈనెల 30వ తేదీన మండల స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థుల ప్రాజెక్టులు, జనవరి 3వ తేదీన జిల్లా కేంద్రంలో జరిగే జిల్లాస్థాయి పోటీలకు నేరుగా అర్హత సాధిస్తాయని జిల్లాస్థాయి అధికారులు చెబుతున్నారు. జిల్లాలో అన్ని యాజమాన్యాల పరిధిలో 3,034 పాఠశాలలు ఉండగా.. వీటిలో 2,74,719 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీటిలో 601 ఉన్నత పాఠశాలల్లో 1.58 లక్షల మంది విద్యార్థులు చదువుతుండగా.. వీరంతా సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనకు అర్హులు.

ఎంపిక చేసిన పాఠశాలల్లో...

ఈనెల 30వ తేదీన ఎంపిక చేసిన పాఠశాలల్లో మండల స్థాయి పోటీలు జరగనున్నాయి. విద్యార్థి వ్యక్తిగత ప్రాజెక్టు, గ్రూప్ ప్రాజెక్టు, టీచర్ ప్రాజెక్టుల వారీగా మూడు కేటగిరిల్లో ప్రదర్శనలో పాల్గొనవచ్చు. సైన్స్ ప్రాజెక్టుల ఎగ్జిబిషన్‌కు శ్రీకాకుళం ఉప విద్యాశాఖ అధికారి ఆర్.విజయకుమారి నోడల్ అధికారిగా నియామకం అయ్యారు. ఈ సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మాథ్స్, ఎర్త్/స్పేస్ సైన్స్, ఎన్విరాన్‌మెంట్, ఇంజినీరింగ్, బయో సైన్స్/బయో కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ అనే ఉప అంశాలపై పాల్గొనాల్సి ఉంటుంది. వీటిలో ఎంపికైనవారు జిల్లాస్థాయిలో జరిగే ప్రదర్శనకు అర్హత సాధిస్తారు. జిల్లాస్థాయి సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా జరగనున్నాయి. జిల్లాస్థాయి సైన్స్ అధికారిగా ఎన్.కుమారస్వామి వ్యవహరిస్తూ ఏర్పాట్లను పూర్తిచేస్తున్నారు.

సూచనలు తప్పనిసరి

మండల, జిలాస్థాయి సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలకు విద్యార్థులను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయాలి. జ్యూరీ కమిటీకి ప్రాజెక్టు పనితీరును వివరించగలిగేలా వారిని తీర్చిదిద్దాలి. సైన్స్ ప్రాజెక్టుల సందర్శన పోటీల్లో పాల్గొన్నవారు శాస్త్రీయ దృక్పథం, సామాజికంగా ప్రయోజనకారంగా ప్రాజెక్టులను తీర్చిదిద్దుకోవాలి. కనీస ప్రమాణాలు కలిగి, ప్రాజెక్టులు నాణ్యమైనవిగా ఉండేవిధంగా తయారు చేయాల్సి ఉంటుంది. ప్రాజెక్టుల తయారీలో థర్మాకోల్‌ను ఎట్టిపరిస్థితిల్లోనూ వినియోగించకూడదని అధికారులు చెబుతున్నారు. థర్మాకోల్‌తో తయారైనటువంటి నమూనాలను ప్రదర్శనలకు అనుమతించబోమని సైన్స్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. అదేవిధంగా అటల్ టింకరింగ్ ల్యాబ్ పాఠశాల నుంచి ఒక్కొక్క ప్రాజెక్టుతో పాల్గొనాలని డీఈవో తిరుమల చైతన్య స్పష్టం చేస్తున్నారు.

విజయవంతం చేయాలి



పాఠశాల విద్యాశాఖ, ఎస్‌సీఈఆర్టీ ఆదేశాల మేరకు ఈ విద్యా సంవత్సరానికిగాను మండలస్థాయి, జిల్లాస్థాయి పోటీల నిర్వహణకు సంబంధించి షెడ్యూల్‌ను ప్రకటించాం. రేపు మండలస్థాయి, జనవరి 3న జిల్లాస్థాయి పోటీలు జరుగుతాయి. హెచ్‌ఎంలు, ముఖ్యంగా సైన్స్ ఉపాధ్యాయులు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలి. సైన్స్ ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేయాలి.

– డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, జిల్లా విద్యాశాఖాధికారి, శ్రీకాకుళం


సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు(ఫైల్)

సమస్యలకు సాంకేతిక పరిష్కారం చూపాలి

- ట్రిపుల్ సీ డిజిటల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్ నాగవీర్ ఉండవల్లి
- టెక్కలి ఆదిత్యలో ఆవిష్కార్ హేకతాన్ ప్రారంభం


ఆవిష్కార్ హేకతాన్ ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు, కళాశాల యాజమాన్యం

టెక్కలి: సమాజంలోని వివిధ రకాల సమస్యలకు సాంకేతిక పరిష్కారం చూపేవిధంగా ఇంజినీరింగ్ విద్యార్థులు పరిశోధనలు చేయాలని ట్రిపుల్ సీ డిజిటల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్ నాగవీర్ ఉండవల్లి ఆకాంక్షించారు. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఆవిష్కార్ హేకతాన్ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు తరగతి గదుల్లో నేర్చుకున్న నైపుణ్యత అంశాలను వ్యక్తీకరణ చేయడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. వ్యక్తిగతంగా, సామాజికంగా ఉన్న సమస్యలకు సాంకేతికత ద్వారా పరిష్కారం చూపడమే సాంకేతిక విద్య ఆవశ్యకత అన్నారు. భవిష్యత్ కాలమంతా కృత్రిమ మేథ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) హవా కొనసాగుతుందని వెల్లడించారు. ఏరంగంలోనైనా రాణించాలంటే స్కిల్ ఐక్యూ, రోల్ ఐక్యూ విధిగా ఉండాలన్నారు. స్కిల్ ఐక్యూ అంటే తెలుసుకున్న నైపుణ్యతను బహిర్గతం చేయడం, రోల్ ఐక్యూ అంటే ఒకే వ్యక్తి ఏదైనా ఒక ప్రాజెక్టును రూపకల్పన చేసి పెట్టడమేనని తెలిపారు. అనంతరం కళాశాల డైరక్టర్ వి.వి.నాగేశ్వరరావు, కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు మాట్లాడుతూ.. కళాశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో దేశంలోని 19 రాష్ట్రాల నుంచి 50 వరకు విద్యార్థి బృందాలు పాల్గొన్నాయని వెల్లడించారు. హాజరైన విద్యార్థుల బృందాలు 48 గంటల పాటు వారి ఆలోచనలను పరిశోధనలకు రూపకల్పన చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్లు, అసోసియేట్ డీన్లు జి.సతీష్‌కుమార్, ఎంవీఎస్ సంతోష్‌కుమార్, జె.సురేష్‌కుమార్, గిరీష్‌కుమార్, సాయిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జడ్జిని కలిసిన ఏపీపీ


జునైద్ అహ్మద్ మౌలానాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏపీపీ శ్రీనివాసరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా మొదటి అదనపు సెషన్స్ జడ్జి కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కింజరాపు శ్రీనివాసరావు శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానాను మర్యాదపూర్వకం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఫ్యామిలీ, పోక్సో కోర్టు పీపీ వాన కృష్ణచంద్, జిల్లా బార్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, సీనియర్ న్యాయవాదులు పాలిశెట్టి మల్లిబాబు, తంగి శివప్రసాదరావు, తెలుగు రాజారావు, బార్ సెక్రటరీ వై.ప్రసన్నకుమార్, కొమ్ము రమణమూర్తి, ఆగూరు ఉమామహేశ్వరరావు, బి.ఎస్.చలం, సత్యారావు, శంకరరావు, మోహనరావు పాల్గొన్నారు.

ఏపీఎం అత్యుత్సాహం

- వీవోఏను తొలగిస్తూ మౌలిక ఆదేశాలు
- కార్యాలయంలో నిలదీసిన వైఎస్సార్‌సీపీ నేతలు


కార్యాలయంలో ఏపీఎంను నిలదీస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శ్రీకాకుళం వెలుగు ప్రాజెక్టులో పనిచేస్తున్న ఏపీఎం కె.రజనీ వీవోఏలపై పెత్తనం చెలాయిస్తూ.. టీడీపీకి అనుకూలంగా ఉన్నవారికి ఒకలా పనిచెప్పడం, వ్యతిరేకంగా ఉన్నవారికి వార్నింగ్‌లు ఇవ్వడంతో పాటు అర్థాంతరంగా తొలగించడం చేస్తోందని మండలంలోని మహిళా సంఘాల సభ్యులు ఆరోపిస్తున్నారు. కొద్దిరోజులు క్రితం ఉన్నతాధికారులకు తెలియకుండానే నైరా పంచాయతీ పరిధి వెంకటాపురం, చల్లవానిపేట గ్రామాలకు సంబంధించి వీవోఏగా పనిచేస్తున్న బొబ్బాది రాధాకుమారిని అర్థాంతరంగా తొలగిస్తూ మౌలిక ఆదేశాలు జారీ చేసినట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. విషయం తెలుసుకున్న స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు శనివారం ఆమె కార్యాలయానికి వెళ్లి నిలదీశారు. ఈ విషయంపై ఏపీఎంను వివరణ కోరగా రెండు వారాల క్రితం రాధాకుమారి వద్ద రికార్డులు తీసుకోవడం వాస్తమేనన్నారు. ఆమెపై గ్రామంలో కొంతమంది ఫిర్యాదులు ఇవ్వడంతో చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. నైరా పంచాయతీ పరిధిలో రెండు వర్గాల మధ్య రాజకీయ రగడ నడుస్తోందని, తాను ఎవరీని నియమించలేదన్నారు. అయితే వేరేవారి దగ్గర రికార్డులు ఎలా ఉన్నాయని వైఎస్సార్‌సీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు.

పెన్షనర్లపై సానుకూల దృక్పథం ఉండాలి


పెన్షనర్ల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: పెన్షనర్ల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని వివిధ పెన్షనర్ల సంఘాల కన్వీనర్ మణికొండ ఆదినారాయణమూర్తి అన్నారు. శ్రీకాకుళంలోని ఎన్జీవో కార్యాలయంలో శనివారం వివిధ సంఘాల పెన్షనర్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆదినారాయణమూర్తి మాట్లాడుతూ.. ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక వైఖరిపై వివిధ సంస్థల పెన్షనర్లు అసంతృప్తితో ఉన్నారన్నారు. వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లకు కరువు భత్యం సకాలంలో చెల్లించడం లేదన్నారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ చెల్లించాలని దేశవ్యాప్తంగా ఆందోళన జరుగుతున్నదని, కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. యూపీఎస్ విధానంలో అనేక లోపాలు ఉన్నాయని, ఓపీఎస్‌కు ప్రత్యామ్నాయం కాదన్నారు. అతి తక్కువ పెన్షన్‌తో బాధపడుతున్న ఈపీఎస్ పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. సీనియర్ సిటిజన్స్‌కు రైల్వే రాయితీ పునరుద్ధరించాలన్నారు. అనంతరం పెన్షనర్ల సమస్యలపై జిల్లాస్థాయిలో ఫిబ్రవరి నెలలో సదస్సు నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. సమావేశంలో వివిధ సంస్థల నాయకులు పి.సుధాకరరావు(బ్యాంకింగ్), ఎన్ఎస్ పండా, ఎం.రామారావు(పోలీస్), పీఎస్ ప్రసాద్‌రావు(ఐఅండ్‌పీఆర్), కె.సోమశేఖరరావు(మెడికల్ అండ్ హెల్త్), కె.రామ్మోహన్‌రావు (ఆర్అండ్‌బీ), కె.వెంకటేశ్వరరావు(అగ్రికల్చర్), వి.జి.కె.మూర్తి, కె.శ్రీనివాస్(ఎల్ఐసీ), కె.చంద్రశేఖరరావు (పోస్టల్), ఎం.గోవర్ధన్‌రావు(బీఎస్ఎన్ఎల్), పి.నరసింహరావు, ఎస్.భాస్కర్‌రావు (ఎడ్యుకేషన్) తదితరులు ఉన్నారు.

సీఎఫ్ చేతివాటంపై దర్యాప్తునకు సన్నద్ధం

టెక్కలి: మండలంలోని గూడేం పంచాయతీ పరిధిలో వెలుగు సీఎఫ్ గంగయ్య చేతివాటం ప్రదర్శించి నకిలీ బ్యాంకు రశీదులను సృష్టించి స్వయం సహాయక సంఘాల డబ్బులను కాజేసిన బాగోతంపై వెలుగు అధికారులు ఆడిట్ సిబ్బందితో దర్యాప్తు చేయడానికి సిద్ధమవుతున్నారు. ఈ మేరకు శనివారం సాక్షిలో ప్రచురితమైన 'బ్యాంకు రశీదుల ఫోర్జరీ' కథనంతో వెలుగు సిబ్బందిలో కదలిక మొదలైంది. కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని సీఎఫ్ గంగయ్యకు స్థానిక వెలుగు అధికారులు సమాచారం ఇచ్చినప్పటికీ, ఆయన హాజరు కాకపోవడంపై ఈ మోసంపై మరింత అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా యూనియన్ బ్యాంక్ టెక్కలి బ్రాంచ్‌కు సంబంధించి నకిలీ రశీదులు సృష్టించిన వైనంపై ఆయా బ్యాంకు అధికారులు పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు చేయకపోవడంపై భిన్నమైన సందేహాలు చోటు చేసుకుంటున్నాయి. ఇదిలా ఉండగా పంచాయతీ పరిధిలో పెద్ద మొత్తంలోనే ఈ మోసం బయటపడే అవకాశాలు ఉన్నాయని ఆయా గ్రామాల్లో చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనప్పటికీ పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిగితే తప్పా ఈ నకిలీ రశీదుల వ్యవహారం కొలిక్కిరాదు.

రామచంద్రపురంలో ఫాగింగ్


రామచంద్రపురంలో ఫాగింగ్ చేయిస్తున్న అధికారులు, సిబ్బంది

ఆమదాలవలస: గ్రామాల్లో దోమలు విజృంభిస్తున్నాయని తెలుపుతూ సాక్షి పత్రికలో 'దోమల దండయాత్ర' శీర్షికతో శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎంపీడీవో వెంకట్రావు గ్రామాల్లో ఫాగింగ్ చేసి, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలోనే కొంతమంది సిబ్బందికి పనితీరు బాగోలేదని నోటీసులు కూడా అందించినట్లు తెలిసింది. అదేవిధంగా మండలంలోని రామచంద్రపురం గ్రామంలో వైద్యశాఖ ఈవో ఎ.జనార్ధనరావు, కార్యదర్శి పి.సమీరాల ఆధ్వర్యంలో శనివారం ఫాగింగ్ చేయించి దోమల నివారణకు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో రామచంద్రపురం సర్పంచ్ చల్లా సింహాచలం, ఎంపీటీసీ దామోదరరావు, ఏఎన్ఎం సీహెచ్ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు


వాహన తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తూరు: ఒడిశా సారా.. పట్టుకోలేరా.. అనే శీర్షికతో శనివారం సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి పోలీసులు స్పందించారు. సీఐ పర్యవేక్షణలో కొత్తూరు మండలంలోని మాతల, నివగాం, మెట్టూరు బిట్–1 ఆర్ఆర్ కాలనీ ఎన్నిరామన్నపేట తదితర ప్రాంతాల్లో సివిల్ ఎస్ఐ ఎండీ అమీర్ ఆలీ తన సిబ్బందితో శనివారం ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో మెట్టూరు బిట్–1 కాలనీకి చెందిన చోడి రాజేష్ ఐదు లీటర్లు నాటుసారా తరలిస్తుండగా ఎన్నిరామన్నపేట వద్ద పట్టుబడ్డాడు. సారాను ఒడిశా రాష్ట్రం హడ్డుబంగి గ్రామం నుంచి తీసుకొస్తున్నట్లు రాజేష్ తెలిపినట్లు ఎస్ఐ చెప్పారు. నాటుసారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి స్థానిక కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

సాక్షి ఎఫెక్ట్...

బకాయి వేతనాలకు మోక్షం

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఆయాల బకాయి వేతనాలకు మోక్షం లభించనుంది. అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో, జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు మూడు నెలల గౌరవ వేతనాలు బకాయిలు ఉన్నాయంటూ ఇటీవలి సాక్షిలో కథనాలు వెలువడిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన ప్రభుత్వం అక్టోబర్, నవంబర్–2024 నెలలకు సంబంధించి బకాయి వేతనాలను రెండు రోజుల్లో జమ చేయనుందని డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య శనివారం తెలిపారు. ఆయాల బ్యాంకు ఖాతాలు పరిశీలించాలని హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లకు విజ్ఞప్తి చేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి

- టెక్కలిలో ఎస్ఎఫ్ఐ 43వ జిల్లా మహాసభలు ప్రారంభం


టెక్కలిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

టెక్కలి: విద్యారంగం సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.రామ్మోహన్ అన్నారు. శనివారం టెక్కలిలో ఎస్ఎఫ్ఐ 43వ జిల్లా మహాసభలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇది మంచి ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటున్నారు తప్పా, విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించడం లేదన్నారు. విద్యార్థుల అభివృద్ధిపై చిత్తశుద్ధిగా వ్యవహరించడం లేదని దుయ్యబట్టారు. విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటాలు చేస్తోందని తెలియజేశారు. అనంతరం బాలికల విభాగం జిల్లా కన్వీనర్ పి.పవిత్ర మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 7 నెలల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా ఎంతో మంది విద్యార్థినులు, మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. విద్యాలయాల్లో విద్యార్థులు వరుసగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నప్పటికీ ప్రభుత్వం కట్టడి చర్యలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. బాలికల రక్షణ కోసం పటిష్టమైన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వాలు దృష్టి సారించాలని, లేని పక్షంలో ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు డి.చందు, సభ్యులు యు.దుర్గాప్రసాద్, సీహెచ్ రాజు, ఎం.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

● శ్రీనివాసా గోవిందా..


జిల్లా కేంద్రంలోని మొండేటివీధి వేంకటేశ్వర ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా శనివారం స్వామివారిని తులసిమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. - శ్రీకాకుళం కల్చరల్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 1వ వార్డు మొగిలిపాడు జాతీయ రహదారిపై శనివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. రోడ్డు పక్కనున్న సాహూ దాబా వద్ద భోజనాలకు అనేక లారీలు నిలిపారు. అయితే ఆ సమయంలో ఒక వ్యక్తి ద్విచక్ర వాహనంతో బలంగా ఢీకొన్నాడు. దీంతో అతడికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్సుకు సమాచారం అందించారు. ఒడిశా రాష్ట్రం సుర్లా గ్రామానికి చెందిన కృష్ణారావుగా గుర్తించారు. పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు.

టెక్కలి రూరల్: మండలంలోని రావివలస జంక్షన్ సమీపంలో శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై నౌపడ నుంచి టెక్కలి వైపు వస్తున్న వ్యక్తి ప్రమాదానికి గురయ్యాడు. సారవకోట మండలం కిన్నెరవలస గ్రామానికి చెందిన కె.జగన్నాథం నౌపడ నుంచి వస్తూ రావివలస జంక్షన్ వద్ద బైక్ అదుపుతప్పడంతో తీవ్రగాయాలకు గురయ్యాడు. గాయపడిన వ్యక్తిని హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి, అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.